ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర




వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 31 | సంచిక : 3 | నవంబరు 2025



**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

**చందా**

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

**చిరునామా**

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342


**ఈ సంచికలో. . . .**


సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ....... 2

చైతన్యానుభవం అయ్యేవరకు దుఃఖం తప్పదు ... 27

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం




ఎవరి బుద్ధి అయితే
సమానంగా ఉందో, ఎవరి
మనస్సు నిర్మలం అయిందో,
ఎవరైతే నిష్కామ కర్మలు
చేస్తున్నారో వారికి మాత్రమే
హృదయంలో ఉన్న
నారాయణుడు
ఎరుకలోనికి
వస్తాడు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 3 మే 1996, కాకినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

దేవుడి అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది, కానీ అనుగ్రహం లేదని మనం అనుకుంటాము. దేవుడి అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. కానీ మనకి రిసీవ్ చేసుకునే శక్తి లేనప్పుడు అనుగ్రహం మనకి లేదు అని అనిపిస్తుంది. అంటే నీటిలో నిలబడి నాకు దాహం వేస్తోంది, నీరు దొరకడం లేదు అనుకోవడం ఎటువంటిదో, దేవుడిని నాకు నీ అనుగ్రహం కావాలి అని అడగడం, నీ అనుగ్రహం లేదు అనుకోవడం కూడా అటువంటిదే. అనుగ్రహం ఎప్పుడూ ఉంది, కానీ దాన్ని మనం అందుకోలేకపోతున్నాం. భగవదనుగ్రహం ఎప్పుడూ ఉన్నప్పటికీ, ఎంతవరకు మనకు అర్హత ఉందో, ఎంతవరకు యోగ్యత ఉందో, అంతవరకే మనం పొందగలం. మన పెద్దలు చెబుతారు కదా, చెంబు పట్టుకుని వెళితే చెరువులో నీళ్ళు చెంబుడే తెచ్చుకోగలం, బిందె పట్టుకెళ్తే బిందెడు తెచ్చుకోగలం, అంటే మన పాత్రని బట్టి అంతవరకే నీళ్ళు మనం తెచ్చుకోగలం. అలాగే దైవానుగ్రహం కూడా ఎప్పుడూ ఉంది కాని దానిని ఎంతవరకు నువ్వు రిసీవ్ చేసుకుంటావు అనేది నీ అర్హతని బట్టి, యోగ్యతని బట్టి ఆధారపడి ఉంటుంది.

నిజమైన ఆనందం ఎక్కడ ఉంది అంటే మన హృదయంలోనే ఉంది. కాని మనం ఆనందం బాహ్యవస్తువులలో అనుకుంటాము, ప్రపంచంలో ఉంది అనుకుంటాము, మనకి వేరుగా ఉంది, బాహ్యంగా ఉంది అనుకుంటాము, కానీ ఆనందం మన హృదయంలోనే ఉంది. ఆనందం ఎక్కడ ఉందో అక్కడ వెతికితే ఈనాటికి అయినా, ముందు నాటికైనా, ఏనాటికైనా దొరుకుతుంది. అది ఎక్కడ లేదో అక్కడ వెతికితే అలా ఎన్ని జన్మలు వెతికినా దొరకదు. వస్తువు ఎక్కడ ఉందో అక్కడ వెతికితే అది మనకి తెలియబడుతుంది. వస్తువు లేనిచోట ఎంత వెతికినా అది మనకి తెలియబడదు. ఆనందం అనేది ఎక్కడ ఉంది అంటే నీ హృదయంలోనే ఉంది. సత్యపదార్థం ఎక్కడ ఉంది అంటే నీ హృదయంలోనే ఉంది,

మనం దేహబుద్ధి కలిగి ఉండడం వలన అది ఎక్కడో నీకు దూరాన ఉన్నట్టు అనిపిస్తుంది. నేను లోపల ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది అని అనుకోవటానికి కూడా దేహబుద్ధే కారణం. లోపల, బయట అనేది కూడా దేహబుద్ధిని బట్టే ఆ తలంపు మనకి వస్తుంది.

ఈ రోజున బుద్ధుడి జయంతి, బుద్ధ పూర్ణిమ. బుద్ధుడు చెప్పింది నిర్వాణ స్థితి, బుద్ధుడు దేవుడి గురించి కూడా మాట్లాడేవాడు కాదు. దేవుడు ఉన్నాడా అంటే మౌనంగా ఉండేవాడు, లేడని చెప్పినా మౌనంగా ఉండేవాడు. భగవంతుడు ఉన్నాడా, లేడా అని బుద్ధుడిని అడిగితే ఉన్నాడు అని చెప్పేవాడు కాదు, లేడని చెప్పేవాడు కాదు. దానికి కారణం ఏమిటి అంటే, నీకు ఎవడో మధ్యవర్తుల తోటి సంబంధం లేకుండా, నీ హృదయంలో ఉన్న ఆనందస్థితిలోకి నిన్ను డైరెక్ట్‌గా పంపించడం కోసం బుద్ధుడు చేసిన ప్రయత్నం అది.

నీకు ఆనందానుభవం లేనప్పుడు, సుఖానుభవం లేనప్పుడు, నీకు శాంతి లేనప్పుడు దేవుడు ఉన్నాడు అని చెప్పినా ఒక్కటే, లేడని చెప్పినా ఒక్కటే! నోటితో దేవుడు ఉన్నాడు అని చెబుతాం అనుకోండి దానికి సంబంధించిన అనుభవం లేనప్పుడు దానికి సంబంధించిన సుఖం కూడా మనకి తెలియదు. అందుచేత దేవుడు ఉన్నాడు, లేడు అనేది సమస్య కాదు. నీ హృదయంలో ఏ శాంతి ఉందో, ఏ సుఖం అయితే ఉందో, అది మధ్యవర్తుల తోటి సంబంధం లేకుండా డైరెక్ట్ గా నీకు అనుభవంలోకి తీసుకురావడం కోసం బుద్ధుడు ప్రయత్నం చేసాడు. నీ లోపల ఒక చైతన్యం ఉంది, ఆ చైతన్యాన్ని నీవుగా అనుభవించడమే పూర్ణస్థితి, అదే నిర్వాణస్థితి. దానిని హిందూమతస్తులు మోక్షం అన్నారు, బౌద్ధమతస్తులు నిర్వాణ సుఖం అన్నారు, క్రైస్తవ మతస్తులు స్వర్గ రాజ్యం అన్నారు. వస్తువు ఒక్కటే, ఒక్కొక్క మతంలో ఒక్కొక్క పేరు పెట్టి పిలిచారు. ఉన్నది ఒక్కటే వస్తువు, సత్య పదార్థం ఒక్కటే, నిజం అనేది ఒక్కటే!

వైరాగ్యం అంటే, నిజం కానిదానిని విడిచిపెట్టడం వైరాగ్యం. నీ హృదయంలో ఒక నిజం ఉంది. ఆ నిజం కానిదానిని విడిచి పెట్టగలగడం వైరాగ్యం. నీకు ఆ వైరాగ్యం కలిగితేనే కానీ నీ హృదయంలో ఉన్న నిజం ఏమిటో నీకు తెలియబడదు. హృదయంలో

ఆనందం ఉంది, చైతన్యం ఉంది, చావులేని స్థితి ఒకటి నీ హృదయంలో ఉంది. నీ శరీరం మరణించినా మరణం లేని వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. అది నీకు నేనుగా వ్యక్తం అయితే అదే నిర్వాణ స్థితి. అంటే చైతన్యం నీకు నేనుగా వ్యక్తం అవ్వాలి, అలా వ్యక్తం అయినప్పుడే నువ్వు నిర్వాణస్థితిని పొందుతావు. ఆ స్థితిని అందుకోవడం కోసం ఇతరులు ఎవరూ మనకు అడ్డురావడం లేదు, నా దేహభావన, నా అహంభావన, నా మనస్సే నాకు అడ్డు వస్తోంది.

గౌతమబుద్ధుడు ఆరు సంవత్సరాలు తపస్సు చేసిన అనంతరం ఆయన దొరికాడు దొంగ అన్నాడు. నా హృదయంలో ఉన్న ఆనందం నాకు అనుభవంలోకి రాకుండా చేసేవాడు నా మనస్సే. ఈ దొంగ ఎవడో అనుకుంటున్నాను, కాని మనస్సే నాకు అడ్డు వస్తోంది. మనస్సు మూలంలో ఉన్న ఆనందం నాకు అనుభవంలోకి రాకుండా అడ్డు వచ్చేది ఈ మనస్సే. అందుచేత మనోమూలం తెలియగానే బుద్ధుడు దొరికాడు దొంగ అన్నాడు. అంటే దొంగని పట్టుకోవడానికి ఆయనకు ఆరు సంవత్సరాలు పట్టింది. ఆయన హృదయంలో ఆనందం ఉన్నప్పటికీ దానికి సంబంధించిన అనుభవం కలగకుండా చేసేది ఆయన మనస్సే, అందుచేత మనస్సే దొంగ అన్నాడు.

బుద్ధుడికి శరీరం వచ్చిన రోజు, ఆయన శరీరం విడిచిపెట్టిన రోజు, ఆయనకి జ్ఞానం వచ్చిన రోజు ఒకేరోజు బుద్ధపూర్ణిమ. శరీరం విడిచిపెట్టినది అదే రోజు, శరీరం వచ్చిన రోజు కూడా అదే రోజు, ఆయనకి జ్ఞానోదయం కలిగినది కూడా అదే రోజు. ఆయన చెట్టు కింద పుట్టాడు, చెట్టు కిందే శరీరం విడిచి పెట్టాడు, చెట్టు కిందే జ్ఞానోదయం కలిగింది. బుద్ధుడి కూడా ఎప్పుడూ ఆయన సవతి తమ్ముడు ఆనంద్ ఉండేవాడు, ఆయనకి ఏమి కావాలన్నా ఆనంద్ అని పిలిచేవాడు. బుద్ధుడు శరీరం విడిచిపెట్టేటప్పుడు ఆనంద్‌కి టియర్స్ వచ్చాయి. అప్పుడు "బుద్ధుడు ఏ స్థితిని అయితే పొందాడో, ఏ నిర్వాణస్థితిని అయితే పొందాడో, ఆ నిర్వాణస్థితిని పొందడం కోసం నువ్వు ప్రయత్నం చెయ్యి, అంతేకానీ నువ్వు నా గురించి విలపించి నువ్వు టైము వేస్ట్ చేసుకోవద్దు, ఎనర్జీ వేస్ట్ చేసుకోవద్దు" అన్నాడు. వాడు బుద్ధుడు అంటే. చివరి టైములో ఆయన చెప్పిన మాటలు అవి.

ఏ మతం అయినా, హిందూమతం అయినా, క్రైస్తవమతం అయినా, మహమ్మదీయ మతం అయినా మూడు విషయాల మీద ఆధారపడి ఉంటుంది. ఒకటి జగత్తు, రెండు జీవుడు, మూడు ఈశ్వరుడు. ఏ మతం అయినా ఈ మూడింటిమీదే బేస్అయ్యి ఉంటుంది. అంటే ఇక్కడ రమణమహర్షి గారు చెప్పేది ఏమిటంటే, ఈ మతాలు అన్నీ దేనిమీద బేస్ అయ్యి ఉన్నాయో, ఆ మూడు కూడా మనస్సు యొక్క కల్పితాలే. జగత్తు మనస్సు యొక్క కల్పితం, జీవుడు మనస్సు యొక్క కల్పితం, ఈశ్వరుడు మనస్సు యొక్క కల్పితం, సైన్సు కూడా మనస్సు యొక్క కల్పితమే. ఎందుచేత అంటే మీకు మైండ్ ఉన్నప్పుడు సైన్సు ఉంది, మైండ్ ఉన్నప్పుడు world ఉంది, మనస్సు అణిగినప్పుడు నీకు సైన్సు గొడవ కూడా లేదు. అంటే మనస్సు ఎంత నిజమో సైన్సు కూడా అంతే నిజం. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు మనోకల్పితములు. మనస్సుని ఆశ్రయించి ఉన్నవి అన్నీ కూడా మనసు అణిగినప్పుడు అణిగిపోతాయి.

జగత్తు దేనిని ఆశ్రయించి ఉంది? మనస్సుని ఆశ్రయించి ఉంది, జీవుడు దేనిని ఆశ్రయించి ఉన్నాడు? మనస్సుని ఆశ్రయించి ఉన్నాడు. మనస్సుని ఆశ్రయించి ఉన్నవి అన్నీ కూడా మనస్సు ఎప్పుడైతే అణిగిపోయిందో, అప్పుడు అవి కూడా అణిగిపోతాయి. మనకి మనస్సే నేనుగా వ్యక్తం అవుతోంది. ఈ మనస్సే నేను అనుకుంటున్నాం, అహంభావనే నేను అనుకుంటున్నాం, కనీసం మనం దానిని డౌట్ చెయ్యడం లేదు. అదే నిజం అనుకోవడం వలన దానిని మనం డౌట్ చెయ్యడం లేదు. ఈ అహంభావనని మనం నిజం అనుకుంటున్నాం. కానీ ఈ అహంభావనని కనుక విచారణ చేస్తే అది నువ్వు కాదన్న సంగతి నీకు తెలుస్తుంది. మనిషి దుఃఖానికి కారణం బాహ్యంగా లేదు, దుఃఖానికి కారణం నీ లోపలే ఉంది, అది అహంభావన రూపంలో ఉంది. దుఃఖం యొక్క కారణం నశిస్తే దుఃఖం కూడా నశిస్తుంది. దుఃఖ కారణం నశించకుండా దుఃఖం కూడా నశించదు. అహంభావన, దేహం సమానంగా పడుకుంటాయి, సమానంగా లేస్తాయి. అహంభావన అణిగిపోయినప్పుడు, దేహం కూడా అణిగిపోతుంది. మనం రాత్రి నిద్రపోయినపుడు మన ఎఫర్ట్ లేకుండా, అహంభావన దాని సోర్స్‌లోకి వెళ్ళిపోతుంది. దాని సోర్స్‌లోకి అది

ఎప్పుడైతే వెళ్లిందో అప్పుడు నీ దేహానికి సంబంధించిన భావన కూడా నీకు ఉండదు. మళ్ళీ ఉదయం నువ్వు జాగ్రదావస్థలోకి వచ్చినప్పుడు, ఈ అహంభావన వచ్చిన తరువాత నీకు దేహభావన వస్తుంది. అంటే అహంభావనని ఆశ్రయించుకున్నవి అన్నీ కూడా జాగ్రదావస్థ వచ్చేటప్పటికి వస్తున్నాయి. అహంభావన వచ్చినప్పుడు నీకు దేహభావన వస్తుంది, అహంభావన అణిగిపోయినప్పుడు దేహభావన కూడా అణిగిపోతుంది. అంటే ఇవి అణిగినప్పుడు రెండూ అణిగిపోతున్నాయి, ఉదయించినప్పుడు రెండూ ఉదయిస్తున్నాయి. అందుచేత దేహం చనిపోయినప్పుడు కూడా, నేను చనిపోతున్నాను అని అంటాడు.

భగవాన్ ఏమి చెప్పారు అంటే చావు ఒక తలంపు, అంటే చావు కూడా నిజం కాదు, పుట్టుక ఒక తలంపు, కష్టం ఒక తలంపు, సంతోషం ఒక తలంపు, తలంపు కానిదల్లా ఈశ్వరఅనుగ్రహం ఒక్కటే. ఈశ్వరఅనుగ్రహం మటుకే, గురువుఅనుగ్రహం మటుకే తలంపు కాదు. ఇప్పుడు మనకి మనస్సే నేనుగా వ్యక్తం అవుతోంది. ఆ నేను కూడా ఒక తలంపు. అది తలంపు కాబట్టే గాఢనిద్రలో దాని గొడవ నీకు లేదు. తలంపులన్నీ అణిగినప్పుడు ఈ నేను కూడా అణిగిపోతోంది. ఎందుచేత అంటే అది కూడా తలంపు కాబట్టి, మాములుగా మీకు watching అవసరం. మీరు ఉదయం లేవగానే ముందు మీకు నేను అనే తలంపు వస్తుంది. మనకి ఇతర తలంపులు రావు, ముందు నేను అనే తలంపు వస్తుంది. ఆ నేను అనే తలంపు వచ్చాక దానికి ఇతర తలంపులు వస్తాయి. అంటే నేను అనేది ఒక తలంపు, దానికి ఇతర తలంపులు వస్తాయి, మంచి తలంపులు రావచ్చు, చెడు తలంపులు రావచ్చు, ఆ ఇతర తలంపులు, నేను అనే మొదటి తలంపు కలిస్తే దానిని



**మన మనస్సు దేహం చుట్టూ తిరుగుతూ ఉంటుంది.**
**ఈ మనస్సును దేవుని చుట్టూ తిరిగేలే చెయ్యాలి.**

మనస్సు అని మనం పిలుస్తున్నాము. దానినే వేదాంత పరిభాషలో జీవుడు అని అన్నారు.

ఇవాళ బుద్ధ జయంతి . మన భారత దేశంలో జన్మించిన మహాత్ములలో ఆయన ఒకరు. ఈ రోజున ఆయనని స్మరించడం అవసరం కాబట్టి ఆయన మాటలు కూడా కొన్ని చెబుతున్నాను. గౌతమబుద్ధుడిని అడిగిన ప్రశ్న ఏమిటంటే, శరీరం మరణిస్తుంది, మరణించిన తరువాత మనస్సో, జీవుడో ఎవడో ఒకడు ఉన్నాడు. వాడు ఎక్కడకి వెళతాడు? వాడు ఏమవుతాడు? ఇది ప్రశ్న. సర్వసాధారణంగా చచ్చిపోయిన తరువాత మనం ఏమవుతాము అనే డౌట్ అందరికీ ఉంటుంది. దీని గురించి కంగారు పడిపోవక్కర్లేదు. చనిపోయిన తరువాత immediateగా మనం అందరం నిద్రలో ఉన్నట్టు ఉంటాము. గాఢనిద్రలో ఎలా ఉంటామో అలా ఉంటాము. చనిపోయిన తరువాత ఏమవుతాము అని అడిగే వారందరికీ కూడా గాఢనిద్రలో ఎక్కడ ఉన్నాము అనే ప్రశ్న రాదు. రోజూ Deep sleepలో కూడా మనం ఉంటున్నాం, కానీ ఎక్కడ ఉంటున్నామో మనకి తెలియదు. మరణానంతర జీవితంలో కూడా అక్కడే ఉంటాము. బుద్ధుడిని అడిగిన ప్రశ్న ఏమిటి అంటే, మరణానంతరం ఏమవుతాము? మరణానంతరం ప్రయాణం చేసేవాడే జీవుడు. ఆ జీవుడిని విచారణ చేస్తే వాడు ఇప్పుడు కూడా లేడన్న సంగతి మీకు తెలుస్తుంది. వాడు నిజంగా ఇప్పుడు కూడా లేడు కానీ ఉన్నాడు అని నువ్వు అనుకుంటున్నావు. మరణించిన తరువాత ప్రయాణం చేసేవాడు ఎవడైతే ఉన్నాడు అని నువ్వు అనుకుంటున్నావో వాడిని విచారణ కనుక చేస్తే, ఆ మరణానంతరం ప్రయాణం చేసేవాడు ఇప్పుడు కూడా లేడు అన్న సంగతి నీకు తెలుస్తుంది. మీరు బాగా పట్టుకోవలసిన పాయింట్ ఇక్కడే ఉంది.

మరణించిన తరువాత మనం వైకుంఠానికి వెళతాం అని, కైలాసానికి వెళతాం అని, స్వర్గానికి వెళతాం అని, ఇప్పుడు పుణ్యాలు చేసేవాళ్ళు అందరూ అందుకే చేస్తున్నారు కదా. ఈ పని చేస్తే పుణ్యం వస్తుంది అని, ఆ పని చేస్తే వైకుంఠానికి వెళతాం అని, ఈ పని చేస్తే కైలాసానికి వెళతాం అని అనుకొంటున్నారు. ఇక్కడ రమణమహర్షి, గౌతమబుద్ధుడు ఏమని చెప్పారు అంటే నువ్వు వెళ్ళే వైకుంఠం కానీ, నువ్వు వెళ్ళే కైలాసం కానీ, అది ultimate truth కాదన్నారు. అది కేవలం నీ మనస్సు ఎంత నిజమో వైకుంఠం కూడా అంతే

నిజం, నీ మనస్సు ఎంత నిజమో కైలాసం కూడా అంతే నిజం, నీ మనస్సు ఎంత నిజమో స్వర్గం కూడా అంతే నిజం, నీ మనస్సు ఎంత నిజమో నరకం కూడా అంతే నిజం. అయితే వైకుంఠం కానీ, కైలాసం కానీ, స్వర్గం కానీ, నరకం కానీ కుందేటి కొమ్ము అని చెప్పలేదు వాళ్ళు. కుందేలుకి అసలు కొమ్ము ఉండదు. వైకుంఠం కానీ, కైలాసం కానీ పారమార్థిక సత్యాలు మటుకు కాదు, వ్యవహారిక సత్యాలు. వ్యవహారిక సత్యం అంటే ఏమిటి? జీవుడు ఎంత నిజమో, ఆ లోకాలు కూడా అంతే నిజం కానీ అది ultimate truth కాదు, final truth కాదు. ఈ లోకాలు, ఈ జన్మలు, ఈ పునర్జన్మలు, రాబోయే జన్మలు ఇవన్నీ కూడా మనస్సు ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. Except Truth, except Brahmam, except Reality everything is created by the mind. ఆ చైతన్యం తప్పించి నువ్వు ఈ లోకాలు మిగతావి అన్నీ కూడా నీ మనస్సు యొక్క కల్పితాలే. మనస్సు యొక్క కల్పితాలు మనస్సు ఉన్నంత సేపు ఉంటాయి. మనస్సు అణిగిపోతే మనస్సు యొక్క కల్పితాలు కూడా అణిగిపోతాయి. అయితే ఆ మనస్సు ఎలాగ అణుగుతుంది?

నీ హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది, ఆ సత్యవస్తువు తోటి నువ్వు సహవాసం చేస్తే మంచిదే, దానితోటి సహవాసం చేసే శక్తి నీకు లేనప్పుడు, బాహ్యంగా ఉన్న సత్పురుషుల తోటి సహవాసం చెయ్యడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. అంటే హోలీ కంపెనీ వల్ల నీ ఎఫర్ట్ తోటి నిమిత్తం లేకుండా ఆ మనసు అణిగిపోతుంది అని ఇక్కడ చెబుతున్నారు. నీకు ఏ తలంపు వచ్చినప్పటికీ నేను అనే తలంపు లోపల ఉంది. ఇప్పుడు కోపం వచ్చింది. దేనికి కోపం వస్తుంది? నేనుకే వస్తుంది కోపం, అంతేకానీ శరీరానికి కోపం రాదు. అంటే నేను అనేది ఒక తలంపు, ఆ తలంపుకి ఇంకొక తలంపు వచ్చింది. తలంపు లేకపోతే కోపం లేదు, తలంపు లేకపోతే అసూయ లేదు, తలంపు లేకపోతే కామం లేదు, తలంపు లేకపోతే కక్ష లేదు, అన్నీ తలంపు వచ్చాకే వస్తాయి. నీకు తలంపు వచ్చాక కోపం వస్తుంది కానీ, తలంపు లేకుండా కోపం లేదు. చనిపోవడం కూడా ఒక తలంపే, నేను చనిపోతున్నాను అని అనుకుంటాడు. దేహం చనిపోతూ ఉంటుంది. కానీ వాడు మనసులో ఏమనుకుంటాడు? నేను చనిపోతున్నాను అనుకుంటాడు. అది కూడా తలంపే. అది కూడా నిజం కాదు,

వ్యవహారిక సత్యమే. శరీరం చనిపోతుంటే, నేను చనిపోతున్నాను అని మనసు ఎందుకు అనుకుంటుంది? మనస్సు చావడం లేదు, శరీరం చనిపోతుంది. కానీ నేను చనిపోతున్నాను అని మనసు అనుకుంటుంది, అదే wrong ఐడెంటిఫికేషన్. అంటే మనసు దేహం తోటి తాదాత్మ్యం చెందుతుంది.

"ఈ మనస్సు దగ్గర గుణం ఏమిటి అంటే ఈ మనస్సు అనే అందానికి దేహం సరిపోలేదు, లోకం సరిపోలేదు, దేవుడు కూడా ఒకడు కావలసివచ్చాడు" అంటారు భగవాన్. అంటే ఈ మనస్సు దేహం లేకుండా, లోకం లేకుండా ఉండలేదు. చాలామంది పుణ్యాలు చేసుకునేవాళ్ళు, యజ్ఞాలు, యాగాలు చేసేవాళ్ళు ఏమి చేస్తారు అంటే, మోక్షాన్ని కోరుకోరు చాలామంది మంచి హయ్యర్ బర్త్‌ని కోరుకుంటారు. అంటే మీరు పైకి చెప్పవద్దు, మీరు ఏవైనా మంచి పనులు చేస్తున్నారు అనుకోండి, ఇంకా మంచి శరీరం రావాలి, హయ్యర్ బర్త్ రావాలి అని అనుకుంటూ ఉంటారు. దీనికి కారణం ఏమిటి అంటే ఇక్కడొక పొరపాటు ఉంది, మానవుడు దేహం లేకుండా ఉండలేను అనుకుంటాడు. దేహం లేకపోయినా మనం ఉండవచ్చు, కానీ దేహం లేకపోతే మనం ఉండము ఏమో అనే భ్రమ వల్ల, భ్రాంతి వల్ల మంచి బర్త్ కోరుకుంటాము. ఇక్కడ ఇంతమంది భక్తులు ఉన్నారు, మనలో మోక్షం కోరుకునే వాళ్ళు ఎంతమంది ఉన్నారో చెప్పండి. అది మన తప్పు కూడా కాదు, ఎందుచేత అంటే దాని విలువ మనకి తెలియటం లేదు కాబట్టి. బుద్ధుడు చెప్పిన నిర్వాణస్థితిని కానీ, ఏసుక్రీస్తు చెప్పిన స్వర్గరాజ్యం కానీ, హిందువులు చెప్పిన మోక్షాన్ని కానీ, ఆ స్టేట్‌ని మనం పొందాలి. అది వస్తుందో, రాదో అనేది వదిలేయండి. మన గోల్ అదే అని తీర్మానించుకున్న వాళ్ళు మనలో ఎంతమంది ఉన్నారు? మనకి ఎంతసేపు వైకుంఠానికి వెళ్ళాలి, కైలాసానికి వెళ్ళాలి, లేకపోతే మంచి హయ్యర్ బర్త్ సంపాదించాలి, మంచి పుణ్యం చేస్తే మంచి జన్మ వచ్చేస్తుంది అని కోరుకుంటున్నాం. మనలో పొరపాటు ఎక్కడ ఉంది అంటే దేహం కనుక లేకపోతే మనం ఉండలేము అని అనుకొంటున్నాము.

భగవాన్ ఏమంటున్నారు అంటే గాఢనిద్రలో నీకు దేహం గొడవలేదు, ఏ గొడవ లేదు అక్కడ నువ్వు శాంతిగా ఉన్నావా? అశాంతిగా ఉన్నావా? అని అడుగుతున్నారు.

చనిపోయిన తరువాత ఏమవుతాము అనేది వదిలెయ్యి నువ్వు, నిద్ర కూడా చావు లాంటిది. గాఢనిద్రలో నీకు దేహం గొడవ లేదు, అప్పుడు దేహం ఏమయ్యిందో నీకు తెలియదు. అప్పుడు శాంతిగా ఉన్నావా? అశాంతిగా ఉన్నావా అన్నారు. అప్పుడు శాంతిగానే ఉన్నాను. అక్కడ దేహం గొడవ లేదు, మనసు గొడవ లేదు, మన ఇష్టాలు, అయిష్టాలు గొడవ లేదు. అక్కడ ఎలా ఉన్నాం మనం? శాంతిగానే ఉన్నాం, కాని అశాంతిగా లేము. మన existence దేహానికే పరిమితం అయి ఉంది అనుకోవడం వలన, ఆ దేహం పోయినప్పుడు మనకి కంగారు వస్తుంది, భయం కలుగుతుంది. భయం కూడా ఒక తలంపే.

మనకి నిజమైన దేవుడు కంటే అబద్ధమైన దేవుడు అంటే ఎక్కువ ఇష్టం. మన హృదయంలో దేవుడు ఉన్నాడు అంటే మీకు ఇష్టం ఉండదు, తిరుపతిలో దేవుడు ఉన్నాడు, అరుణాచలంలో దేవుడు ఉన్నాడు అంటే మీరు బాగా ఇష్టపడతారు. మొట్టమొదట కృష్ణుడు ఏమని చెప్పాడు అంటే నేను అందరి హృదయాలలో చైతన్యంగా ఉన్నాను అని చెప్పాడు ఆ మాట ఎవ్వరూ పట్టించుకోరు. నేను రాముడిగా ఉన్నాను అని చెబితే పట్టించుకుంటున్నాం, ఆ మాట, ఈ మాట కూడా కృష్ణుడు చెప్పిందే, కానీ ముందు నేను రాముడిగా ఉన్నాను, కృష్ణుడిగా ఉన్నాను అని చెప్పలేదు. ఆయనది ఫస్ట్ statement ఏమిటి అంటే నేను అందరి హృదయాలలోను చైతన్యంగా ఉన్నాను, ఆత్మగా ఉన్నాను అని చెప్పాడు. అంటే మనం తలకాయలలో వేరు వేరుగా ఉన్నా హృదయాలలో ఒకటిగానే ఉన్నాం. అంటే మనం నోరు మూసుకుని హృదయాన్ని తెరిస్తే ఈ సత్యం తెలుస్తుంది. కాని మనం ఏమి చేస్తాం అంటే హృదయాన్ని మూసుకుంటాం, నోరు తెరుస్తాం. నోరు మూసుకుని హృదయాన్ని తెరచిన వాడికి మాత్రమే ఈ సత్యం తెలుస్తుంది.

నిజమైన దేవుడు అంటే, మన కంట్రోలర్ మన హృదయంలోనే ఉన్నాడు. అయితే మనకి దేహబుద్ధి ఉంది కాబట్టి వెంకటేశ్వరస్వామిని దేవుడు అనుకుంటున్నాం, అరుణాచలేశ్వరుడు దేవుడు అనుకుంటున్నాం, కాశీలో విశ్వేశ్వరుడు దేవుడు అనుకుంటున్నాం. అంటే ఈ దేహం నువ్వు కాకపోయినా దేహం తోటి ఏవిధంగా తాదాత్మ్యం పొందుతున్నావో, అలా గుడిలో ఉన్న విగ్రహంతోటి కూడా దేవుడు తాదాత్మ్యం పొందుతున్నాడు. అది

ultimate truth మటుకు కాదు, అది పారమార్థిక సత్యం మటుకు కాదు, అది కేవలం వ్యవహారిక సత్యం. మీరు ఏదో లోపల చైతన్యం ఉంది అంటున్నారు, అది నాకు తెలియడం లేదు. ఈ మనసు తెలుస్తోంది, నాకు దేహం తెలుస్తోంది. నాకు తెలిసిన ఈ మనసు కానీ, నాకు తెలిసిన ఈ దేహం కానీ ఆ చైతన్యానుభవం పొందడం కోసం ఎంతవరకు ఉపయోగపడతాయి? ఎలా వాటిని ఉపయోగించుకోవాలి అనేది ప్రశ్న.

భగవాన్ ఏమంటున్నారు అంటే, దేహం నువ్వు అనుకున్నప్పుడు, మనస్సు నువ్వు అనుకున్నప్పుడు కూడా నువ్వు వాటికి అతీతంగానే ఉన్నావు, నువ్వు చైతన్యంగానే ఉన్నావు, ఆ చైతన్యం నీకు తెలియకపోవచ్చు, కానీ నువ్వు చైతన్యంగానే ఉన్నావు, అది తెలుసుకుంటే సుఖపడతావు, తెలియకపోతే దుఃఖం, అంతకంటే ఏమీ లేదు. నీకొక మనస్సు ఉంది, నీకొక దేహం ఉంది, ఆ రెండు నీకు తెలుస్తున్నాయి. దేహం నువ్వు అనుకోవచ్చు, మనస్సు నువ్వు అనుకోవచ్చు, కానీ ఆ రెండింటికి కూడా నువ్వు అతీతంగానే ఉన్నావు. నీకు ఒక దేహం ఉంది, నాకొక దేహం ఉంది అనుకుంటే నీకు ఇబ్బంది లేదు. అదే నేను అనుకుంటే మటుకు నీకు బ్రహ్మానుభవానికి అదే అడ్డు వస్తుంది అంటున్నారు. భగవాన్ తరచుగా చెబుతూ ఉంటారు, నీకు డబ్బు ఉండవచ్చు కానీ డబ్బు నువ్వు అనుకోకు. అలాగే నీకు చదువు ఉండవచ్చు కానీ చదువు నువ్వు అనుకోకు. నీకు ఏదైనా మంత్రి పదవి ఉండవచ్చు, నీ దేహప్రారబ్ధాన్ని బట్టి అది నీకు వస్తే రావచ్చు, కానీ ఆ పదవి నువ్వు అనుకోకు. అలాగే నీకొక దేహం ఉండవచ్చు, నేను దేహం అనుకోవడం వేరు, నాకొక దేహం ఉంది అనుకోవడం వేరు. నాకొక దేహం ఉంది అనుకొంటే నీకు ఏమి ఇబ్బంది లేదు. నేనే దేహం అనుకుంటే మటుకు నీకు బ్రహ్మానుభవం కలగడం కోసం ఈ తలంపు నీకు అడ్డు వస్తుంది. నువ్వు మాట్లాడే మాటలో కానీ, నువ్వు ఆలోచించే ఆలోచనలో కానీ, నువ్వు చేసే పనిలో కానీ, నీ దేహబుద్ధిని పెంచుకుంటూ వెళితే నీకు బ్రహ్మానుభవం కలగడం కోసం నీ దేహబుద్ధి తప్పనిసరిగా సెంటుపెర్సెంటు ఆటంకమే.

మనం ఏదైనా పని చేస్తాం అనుకోండి దేహబుద్ధిలోంచి విడుదల పొందడానికి ఆ పని సహకరించాలి, అది యోగం, కర్మయోగం. అంటే నువ్వు చేసే కర్మని యోగంగా

చెయ్యి, అది కృష్ణుడు చెప్పింది. నువ్వు కర్తృత్వం లేకుండా పనిచేస్తే ఆ పని యోగం అవుతుంది. దేవుడు, దేవుడు అంటే ఏమీ లేదు, బాగా అర్థం చేసుకోండి. మనం ఏదైనా మంచి పని చేస్తాం, దానికి ఫలితం ఉంది, ఒక చెడ్డ పని చేస్తాం, ఆ చెడ్డకి ఫలితం ఉంది. ఈ పనేమో కారణం, ఆ ఫలితం కార్యం. ఆ కారణానికి, కార్యానికి అనుసంధానం చేసేవాడే దేవుడు. అంటే దేవుడిని కర్మఫలప్రదాత అంటారు. నువ్వు చేసినటువంటి పనికి ఫలితం ఇచ్చేవాడు దేవుడు. దేహబుద్ధి ఎంతవరకు నువ్వు తగ్గించుకోగలుగుతున్నావో అంతవరకు నీకు బ్రహ్మానుభవం కలగడం కోసం అది సహాయం చేస్తుంది. అందుచేత మనం దేహబుద్ధిని తగ్గించుకోవాలి. దేహబుద్ధిని తగ్గించుకోవడం అంటే దానికి వెళ్ళే ఫుడ్ సప్లైని కట్ చెయ్యాలి. మీరు ఏదైనా మంచి పని చేసి quietగా ఉంటారు అనుకోండి, మీ సంకల్పం తోటి, మీ కోరిక తోటి సంబంధం లేకుండా అది ఇతరులకి తెలిస్తే దానివల్ల మీకు నష్టం ఏమి లేదు. కానీ మనం చేసిన మంచి పని అందరికీ తెలియాలి అని మీరు అనుకుంటారు అనుకోండి, దానివల్ల మీకు పుణ్యం వస్తుంది కానీ జ్ఞానం మటుకు రాదు.

భగవాన్ చెబుతూ ఉంటారు నాదిని విడిచిపెడితే చిత్తశుద్ధి కలుగుతుంది, నేనుని విడిచిపెడితే జ్ఞానం కలుగుతుంది. నీకు దేహం ఉంది, నీకు మనస్సు ఉంది, బ్రహ్మానుభవం పొందడం కోసం ఇవి రెండింటిని ఉపయోగించుకో. దేహాన్ని, నీ మనస్సుని బ్రహ్మానుభవం పొందడానికి ఉపయోగించుకో, బ్రహ్మానుభవం పొందడానికి నువ్వు వీటిని ఉపయోగించుకోవు అనుకో ఇదంతా వేస్ట్. దేహం తెలుసు అంటున్నావు, మనసు తెలుసు అనుకుంటున్నావు. నీ లోపల ఉన్న చైతన్యాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడానికి ఈ మనస్సుని, దేహాన్ని

**శరీరం మరణించినా మరణం లేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది, అది మనమై ఉన్నాము. దానిని తెలుసుకొనుటకే మనం ఈ భూమి మీదకు వచ్చాము. వచ్చిన పనిని మనం మర్చిపోకూడదు.**



ఉపయోగించుకుంటే నీకు చైతన్యం ఎరుకలోకి వస్తుంది. ఆత్మానుభవం కోసం ఈ మనస్సుని, ఈ దేహాన్ని ఎంతవరకు నువ్వు ఉపయోగించుకున్నావో అంతవరకు నువ్వు జీవించినట్టు లెక్క. మిగతా అంతా కూడా వేస్టే.

ఒక పండితుడు వేదాలు అవి బాగా చదువుకున్నాను, నా పాండిత్యం ఆత్మసాక్షాత్కారం కలగడం కోసం ఏమైనా నాకు ఉపయోగపడుతుందా అని అడుగుతున్నాడు. అప్పుడు రమణమహర్షి గారు "చదువుకున్న మూర్ఖులు, చదువులేని మూర్ఖులు అని. వాడు ఎవడో వాడు తెలుసుకునేవరకు మానవుడు మూర్ఖుడుగానే ఉంటాడు. వాడు ఎవడో వాడు తెలుసుకుంటేనే వాడి ప్రవర్తన intelligentగా ఉంటుంది. ఇది బాగా అర్థం చేసుకోండి. అంటే నేను ఎవడినో నాకు తెలిసేవరకు నేను మూర్ఖుడినే. మానవుడు వాడు ఎవడో వాడు తెలుసుకునేవరకు వాడు మూర్ఖుడుగానే ప్రవర్తిస్తాడు. ఒకడికి చదువు ఉండవచ్చు అంటే వాడికి మూర్ఖత్వంతో పాటు అదనంగా చదువు ఉంటుంది. భగవాన్ చెప్పిన మెయిన్ పాయింట్ ఏమిటి అంటే మనం మెడలో వస్తువులు వేసుకుని ఎలా అయితే అలంకరించు కుంటామో, అలాగ నీ అహంభావనని నువ్వు అలంకరించుకోవద్దు. నువ్వేమి పెద్ద కష్టపడి పోవక్కర్లేదు, నీ అహంభావనను అలంకరించుకోవడం మానేస్తే నీ హృదయంలో ఉన్న చైతన్యం నీకు వ్యక్తం అవుతుంది.

భగవాన్ చెప్పేది ఏమిటి అంటే, బ్రహ్మానుభవం పొందాలి అని మన ఉద్దేశ్యం కానీ మనం అహంభావనని అలంకరించుకుంటున్నాం. మనం అందరం పర్ఫెక్షన్ పొందడానికి ప్రయత్నం చేస్తున్నాం కానీ మనం చేసే పనులు అన్నీ కూడా enjoymentకి సంబంధించిన పనులు చేస్తున్నాము. వేదాలు బాగా చదివాను అని నువ్వు చెబుతున్నావు, దేవుడు వేదంలో లేడు నీ హృదయంలో ఉన్నాడు. నీ హృదయంలో నువ్వు అన్వేషిస్తే ఆయన ఎరుక పడతాడు. శరీరం ఉండగానే మనం సాధన చేసి వాసనాక్షయం పొందాలి. అంతేకానీ మరణించిన తరువాత మనం పొందడానికి ఏమీ అవకాశం లేదు. చెడ్డ లోకాలు ఉన్నాయి, మంచి లోకాలు ఉన్నాయి ఆ లోకాల్లోకి వెళతాం, అక్కడ మనం అనుభవించవలసినది ఏదో అనుభవిస్తాం, మళ్ళీ ఈ భూమి మీదకి వచ్చి, ఇక్కడ దేహం ధరించి సాధన చెయ్యవలసిందే

కానీ మరణించిన తరువాత అక్కడ వాసనాక్షయం మనకి ఏమీ జరగదు. ఇప్పుడే, ఇక్కడే దేహం ఉండగానే టైం వేస్ట్ చేసుకోకుండా నువ్వు ఎవడవో నువ్వు తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి. ఎక్కడో, ఎప్పుడో ఉంది అని నువ్వు అనుకునేది ఇప్పుడే ఇక్కడే ఉంది. మీ మనస్సు ఏమి చేస్తుంది అంటే హృదయంలోకి అది లయం కాకుండా ఉండడం కోసం, అంటే హృదయగతంగా మనస్సు ప్రయాణం చెయ్యకుండా ఉండడం కోసం ఏదో కల్పిస్తుంది. ఎక్కడో ఉంది, ఎక్కడో ఉంది అనిపిస్తుంది మీకు, మీ మనస్సు యొక్క కల్పన అది. ఎక్కడో ఉంది అనుకున్నది ఇక్కడే ఉంది. మీ మనస్సుని కొంచెం హృదయం వైపుకి ప్రయాణం చేయించగలిగితే ఎప్పుడో వస్తుంది అనుకున్నది ఇప్పుడే వస్తుంది అంటున్నారు. ఆచార్యుల వారు ఏమని చెప్పారు అంటే నీ మనస్సుని వెనక్కి పంపు, అప్పుడు లోపల ఉన్న చైతన్యం ముందుకు వచ్చి నీ మనస్సుని మింగేస్తుంది. అప్పుడు మిగిలేది చైతన్యమే. అదే నిర్వాణ స్థితి. నువ్వు ఏదైతే తెలుసుకోవాలి అనుకుంటున్నావో అది నీవే.

మనం పని చేసేటప్పుడు ఫలితం కోసం పనిచేస్తాం. అంటే కోరిక పెట్టుకుని పని చేస్తాం. పని చేసినప్పుడు ఫలితం వస్తుంది, వచ్చిన ఫలితాన్ని మనం ఎంజాయ్ చేస్తాం, ఎంజాయ్ చేసినపుడు మీకు ఆ వాసన పడుతుంది, మీరు ఎంజాయ్ చెయ్యకపోతే వాసన పడదు. నువ్వు ఎంజాయ్ చేసినప్పుడు వాసన పడుతుంది. వాసన లోంచి తలంపు వస్తుంది, తలంపు లోంచి మళ్ళీ నువ్వు పని చేస్తావ్. పని వల్ల ఫలితం వస్తుంది. ఆ ఫలితాన్ని నువ్వు ఎంజాయ్ చేస్తావు. మళ్ళీ ఎంజాయ్ చేసినపుడు వాసన పడుతుంది. ఇది ఒక చక్రం, దీనినే కర్మచక్రం అంటారు. ఈ కర్మచక్రంలోంచి విడుదల పొందాలి అంటే ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా, నీ స్వప్రయత్నం లేకుండా నువ్వు బయట పడలేవు, మనిషి ఈ చక్రంలోనే తిరుగుతూ ఉంటాడు. అంటే వాడి ప్రారబ్ధాన్ని అనుసరించి మంచి జన్మలు రావచ్చు, చెడు జన్మలు రావచ్చు, మంచి లోకాలు రావచ్చు, చెడు లోకాలు రావచ్చు అది వేరే విషయం. కానీ ఇది కర్మచక్రం. ఈ కర్మచక్రం నుండి బయట పడాలి అంటే భగవంతుడి అనుగ్రహం లేకుండా వాడు బయట పడలేడు. మనం దేవుడు దేవుడు అనుకుంటున్నాం చూడండి, లేకపోతే చైతన్యం, చైతన్యం

అనుకుంటున్నాం చూడండి దానికి సంబంధించిన interference లేకుండా, అంటే మనం చేసేది కృషి, భగవంతుడు ఇచ్చేది కృప. ఆయన కృప లేకుండా మటుకు ఈ చక్రం లోంచి మనం విడుదల పొందలేము.

నేను బాగా చదువుకున్నాను అంటున్నావు కదా అది కూడా ఒక వాసన అయ్యి కూర్చుంటుంది. మీకు అర్థం అవుతుందా? శాస్త్రవాసన, లోకవాసన, దేహవాసన. ఈ మూడు వాసనలలోని అత్యంత బలీయమైనది దేహవాసన. ఎవరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా, అద్వైత సాంప్రదాయమో, లేకపోతే ద్వైతమో, ఏదో ఒకటి, నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహబుద్ధి నశించకుండా నీకు ఆత్మబుద్ధి కలగదు. అంటే ఏ మార్గంలో నువ్వు ప్రయాణం చేసినా నీ దేహబుద్ధి నశించాలి. అంటే సాధన యొక్క ప్రయోజనం దేహబుద్ధి నశింపచెయ్యడానికే. దేహబుద్ధి నశించిన మరుక్షణంలో నీకు ఆత్మబుద్ధి కలుగుతుంది.

పునర్జన్మ హేతువులు అన్నీ ఎక్కడ ఉన్నాయి? మనసులో ఉన్నాయి. మనసు ఎప్పుడైతే కరిగిపోయిందో, పునర్జన్మ హేతువులు అన్నీ మనసులో ఉన్నాయి కాబట్టి ఇప్పుడు నువ్వు ఏమీ కంగారు పడక్కర్లేదు, మనసు పోతే నేను పోతానని నువ్వు అనుకోవక్కర్లేదు. మనసు పోతే నేను పోతాను అని నీకు భయం వేస్తుంది, మనసు పోతే నువ్వు పోవు, నువ్వు ఎవరవో నీకు తెలుస్తుంది. అంటే మనసు ఎక్కడైతే నశించిందో అక్కడ చైతన్యం నీకు నేనుగా వ్యక్తం అవుతుంది. మనసు నశించడం వలన నువ్వు పోవు, నువ్వు ఎవరవో నీకు తెలుస్తుంది, ఇది ఇక్కడ సత్యం. అహంభావనని పోగొట్టుకోవడానికి మనిషి ఇష్టపడడు. మన అహంభావన "నువ్వు నా గొడవలోకి రాకు, నువ్వు జపం చేసుకో, యజ్ఞం చేసుకో, యాగం చేసుకో, ధ్యానం చేసుకో, పూజ చేసుకో, గుళ్ళు అవి కట్టించు, పుణ్యాలు అవి బాగా చేసుకో, కానీ నా జోలికి రావద్దు" అని చెబుతుంది. తెల్లవారుఝామున నాలుగు గంటలకి లే, నువ్వు బాగా జపం చేసుకో అని చెబుతుంది. యజ్ఞాలు, యాగాలు చేసుకో, సత్రాలు కట్టించు, నుయ్యిలు తవ్వించు, నీకు బాగా పుణ్యం వస్తుంది, పుణ్యం వస్తే దానిని ఎంజాయ్ చెయ్యవచ్చు. అన్నీ చేసుకో కానీ నా జోలికి రావద్దు అని చెబుతుంది. నీకు

కావలసిన పనుల అన్నీ నేను చేసి పెడతాను. పుణ్యం కావాలంటే పుణ్యం సంపాదించి పెడతాను, నువ్వు వైకుంఠం వెళ్ళాలంటే వైకుంఠానికి వెళ్ళే పనులు అన్నీ చేసి పెడతాను నన్ను మటుకు విచారణ చెయ్యకు, నన్ను మినహాయించు, నా జోలికి మటుకు రాకు అని చెబుతుంది. ఆలా ఎందుకు చెబుతుంది అంటే దాన్ని ప్రశ్నిస్తే దాని existence లేకుండా పోతుంది. తనని తాను నాశనం చేసుకోవడానికి అది ఇష్టపడదు. ఈశ్వరానుగ్రహం లేకుండా దానిని ప్రశ్నించే బుద్ధి మనకు కలగదు. మనం సబ్జెక్టు బాగా శ్రవణం చెయ్యాలి, అసలు మన దుఃఖానికి ఏది కారణమో ముందు మనకి తెలియాలి. ఇది బాగా అర్థం చేసుకోండి.

మనం భగవంతుడిని ఏదో ఒక వరం కోరతాము, వరం కోరితే ఆయన ఇస్తాడు, మనం దానిని అనుభవిస్తాము. భగవంతుడు ఇచ్చిన వరాలు మనం అనుభవించినప్పుడు, ఆ పుణ్యఫలితం అది ఎలాగో ఖర్చు అయ్యి పోతుంది. ఆ అనుభవించినది మటుకు కొత్త వాసనని మిగిల్చి మరీ వెళ్తుంది. మళ్ళీ ఆ వాసన పునర్జన్మకి కారణం అవుతుంది. భగవాన్ ఏమని చెబుతున్నారు అంటే నీకు అన్నీ ఉండవచ్చు, తెలివితేటలు ఉండవచ్చు, discrimination ఉండవచ్చు, ఉంటే నీ హృదయంలోని సద్వస్తువుని తెలుసుకోవడానికి నీ తెలివిని ఉపయోగించుకో, అంటే ఆ తెలివిని నువ్వు సద్వినియోగం చేసుకో, అలాగే నీకు ధనం ఉండవచ్చు, దానిని సద్వినియోగం చేసుకో, అలాగే చదువు ఉండవచ్చు దానిని సద్వినియోగం చేసుకో, కానీ వాటిని నువ్వు సద్వినియోగం చేసుకోకపోతే అవి ఉన్నా నీకు ప్రయోజనం లేదు. దానికి ఉదాహరణగా భగవాన్ ఒక మాట చెప్పారు, నువ్వు ఎసి గదిలో పడుకున్నావు అనుకో, మంచం మీద పరుపు – తల కింద దిండు ఉంది అనుకో, నువ్వు నిద్రపోవడానికి అన్ని సదుపాయాలు ఉన్నాయి అనుకో, అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ నీకు నిద్ర పట్టడం లేదు అనుకో, నాకు నిద్ర పట్టకపోయినా ఫరవాలేదు సదుపాయాలు అన్నీ బాగున్నాయి, ఎసి గదిలో ఉన్నాను అని ఎవడైనా అనుకుంటాడా అంటున్నారు. ఇవన్నీ comforts, ఇవన్నీ నిద్ర బాగా పట్టడానికి ఉపయోగించుకుంటున్నారు. వీటివల్ల నిద్ర పట్టకపోతే, ఇవన్నీ నాకు సరిపోతాయి నాకు నిద్ర పట్టకపోయినా ఫరవాలేదు అని ఏ మనిషి అనుకోడు. ఇవన్నీ

కూడా నిద్రపట్టడానికి ఏవిధంగా ఉపయోగించుకుంటున్నావో, అలాగే నీకు భగవంతుడు ఏవైతే అవకాశాలు ఇచ్చాడో ఆ అవకాశాలు అన్నీ కూడా నువ్వు భగవధనుభవం పొందడం కోసం ఉపయోగించుకో, అంటే సద్వినియోగం చేసుకో!

వైరాగ్యం, అభ్యాసం ఇవి రెండింటి గురించి పరమాత్మ గీతలో repeatedగా చెప్పారు. వైరాగ్యం ఏమి పని చేస్తుంది అంటే మనసు బాహ్యవిషయాలలోకి వెళ్ళకుండా ఆపు చేస్తుంది. నీ మనసు బాహ్య విషయాల వైపు వాలకుండా వైరాగ్యం నీకు సహకరిస్తే, అభ్యాసం ఏమి చేస్తుంది అంటే హృదయాభిముఖంగా నీ మనసు ప్రయాణం చెయ్యడం కోసం అభ్యాసం సహకరిస్తుంది. అది వైరాగ్యం చేసే పని, ఇది అభ్యాసం చేసే పని. అంటే వైరాగ్యం వల్ల, అభ్యాసం వల్ల నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు గోచరం అవుతుంది. ఈ ప్రపంచం నిజం అనుకున్నంతకాలం ఈ ప్రపంచంలోకి మనసు అలా విజృంభిస్తునే ఉంటుంది. మనం ధ్యానం చెయ్యడానికి కూర్చుంటాం, ధ్యానం చెయ్యడానికి కూర్చున్నప్పుడు మనసుని బలవంతంగా అక్కడ ఆపుచేసి ఉంచుతాము. మీరు ధ్యానం చేసి గదిలోంచి బయటకి వచ్చేశారు అనుకోండి మీ మనసు ఎక్కడకి వెళ్ళిపోతుంది? బయటకి వెళ్ళిపోతుంది, కారణం ఏమిటి చెప్పండి, ఇదంతా నిజంలాగ మీకు కనిపిస్తుంది కాబట్టి. మీ మనసుని వదిలేయండి అలా ఏమి చేయకుండా, అది బాహ్యముఖానికి వచ్చేస్తుంది, కారణం ఏమిటి అంటే మీకు ఇదంతా నిజంలా కనిపిస్తుంది కాబట్టి అది బయటకి వచ్చి వాలిపోతుంది. వైరాగ్యం ఉంటేనే కానీ అది వాలటం మానదు.

ధ్యానం చెయ్యడం వలన, విచారణ చెయ్యడం వలన మీకు spiritual strength వస్తుంది, మైండ్ ఏకాగ్రం, సూక్ష్మం అవుతుంది. అంటే సూక్ష్మదృష్టి కలుగుతుంది. మనం ఏదైనా బాహ్య విషయాలు గ్రహించడానికి కూడా స్థూలదృష్టి ఉన్నవాడి కంటే సూక్ష్మదృష్టి ఉన్నవాడు బాగా గ్రహించగలడు. ఈ మెడిటేషన్, ఈ కాన్సంట్రేషన్, ఎంక్వయిరీమైండ్‌ను సూక్ష్మాతి సూక్ష్మం చేస్తుంది. సూక్ష్మాతి సూక్ష్మం అయిన మనస్సు, బాగా పవిత్రం అయిన మనస్సే హృదయాభిముఖంగా ప్రయాణం చెయ్యగలదు. స్థూలదృష్టి ఉన్నవాడు హృదయాభిముఖంగా ప్రయాణం చెయ్యలేడు, సూక్ష్మదృష్టి ఉన్నవాడు హృదయాభిముఖంగా

ప్రయాణం చేస్తాడు. స్థూలదృష్టి ఉన్నవాడి కంటే సూక్ష్మదృష్టి ఉన్నవాడు ఉన్నది ఉన్నట్టుగా అందులో ఉన్న నిజాన్ని గ్రహించగలడు. సూక్ష్మబుద్ధి ఉన్నవాడు గ్రహించినట్టు స్థూలబుద్ధి ఉన్నవాడు గ్రహించలేడు. ఇక్కడ చెప్పేది ఏమిటంటే, నువ్వు effortlessగా గాఢనిద్రలోకి వెళుతున్నావు, గాఢనిద్రలో నీ ప్రయత్నం లేకుండా మనస్సు దాని సోర్స్‌లోకి అది వెళ్తుంది. ఇప్పుడు నువ్వు జాగ్రదవస్థలో ఎఫర్ట్ చేసి దానిని సోర్స్‌లోకి పంపించగలగడమే సాధన యొక్క ప్రయోజనం, అదే సాధన. ఆ సాధన కేవలం నీ తెలివితేటల వల్లే జరగదు. దానికి స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం అవసరం. నువ్వు చెయ్యగలగినదేదో నువ్వు చెయ్యి, నువ్వు ప్రయత్నం చేస్తుంటే నువ్వు చేస్తున్న ప్రయత్నమే అనుగ్రహంగా మారుతుంది. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే సాధన చేసేవాడు ఎవడు? దేహం సాధన చేయదు, అది ఎక్కడ కూర్చోమంటే అక్కడ కూర్చుంటుంది. అసలు లోపల ఉన్న చైతన్యానికి ధ్యానమే అక్కర్లేదు, దానికంటే ద్వితీయం లేనేలేదు. దానికంటే వేరుగా ఏది లేదు చైతన్యానికి, దానికి కూడా ధ్యానం అక్కర్లేదు. బాడీకి అక్కర్లేదు, ఇంక ధ్యానం చేసేది ఎవరు? మనస్సే చేస్తుంది. నీకు అడ్డు వచ్చేది ఎవరు? మైండ్. సాధన చేసేది ఎవరు? మైండ్. అయితే ఇక్కడ మనం ఒకటి గ్రహించాలి. మనలో ఎవడైతే ఉండి ధ్యానం చేస్తున్నాడో, వాడే మన realizationకి అడ్డు వస్తున్నాడు అన్న విషయం ముందు మనం గ్రహించాలి.

భగవాన్ అన్నారు నోరు మూసుకుని ఊరుకో, ఊరక ఉండు అన్నారు. ఊరక ఉండు, quietగా ఉండు. నేను సాధన చేసేస్తున్నాను, నేను సాధన చేసేస్తున్నాను అని

**సత్యానుభవం కలగడానికి**
**సాత్విక ఆహారం, సత్సంగం**
**ఇవి రెండూ చాలు అనేవారు భగవాన్.**



ప్రతీవాడు అంటాడు. వచ్చినవాళ్ళు భగవాన్ దగ్గర మేము అందరం గజ ఈతగాళ్ళమే అన్నారు. సరే ఈదటం మొదలు పెట్టమన్నారు. తీరా నీటిలో దిగాక ఎవరూ గజం కదలడం లేదు. నువ్వు ధ్యానం చేస్తున్నావు రైటే, జపం చేస్తున్నావు రైటే ముల్లంత, రవ్వంత, చింతాకు అంత అయినా నువ్వు హృదయాభిముఖంగా వెళ్ళావా? నువ్వు జపం చేస్తున్నావు ధ్యానం చేస్తున్నావు, విచారణ చేస్తున్నావు, ఇదంతా ఎవరు చేస్తున్నారు? మైండ్ చేస్తుంది. మనస్సే ధ్యానం చేస్తుంది, విచారణ చేసేది మనస్సే, చైతన్యానికి విచారణ అక్కర్లేదు, ధ్యానం అక్కర్లేదు. నువ్వు మనస్సు తోటి ధ్యానం చేసి, మనస్సు తోటి జపం చేసి, మనస్సు తోటి విచారణ చేసి దానిని నువ్వే చావు అంటున్నాము. మనసుతో ధ్యానం చేసి దాన్ని చంపడానికే ప్రయత్నం చేస్తున్నాం, అది కనిపెట్టేస్తుంది. ధ్యానం చేసి మనల్ని చంపడానికే వీళ్ళు చూస్తున్నారు, విచారణ చేసి మనల్ని చంపడానికే చూస్తున్నారు, అందుచేత మనం చేసినట్టు నటిద్దాం, నిజంగా చెయ్యద్దు అనుకుంటుంది. నిద్రపోయేవాడిని లేవగొట్టగలం కానీ, నిద్రపోయినట్టు నటించేవాడిని మనం లేపలేము. మైండ్ అలాగ నటిస్తుంది. మీలో ఎవరైనా ధ్యానం చేసేవాళ్ళు ఉంటే ధ్యానం చేయండి, మెడిటేషన్ మంచిదే. అసలు ఎంతసేపు మీకు మెడిటేషన్ కుదురుతుందో చూడండి. ఒక గంట కూర్చున్నారు అనుకోండి, కరెక్ట్‌గా ఎన్ని నిముషాలు మీకు మెడిటేషన్ కుదురుతుందో చూడండి. ఎందుచేత అంటే, దానిని చంపుతున్నామన్న సంగతి అది గ్రహించేసింది. గ్రహించేసి మనం చెయ్యమని అడుగుతుంటే చేసినట్టు అది నటిస్తుంది. Fundamentalగా ఈ విషయం ముందు మనకి అర్థం కావాలి. నీ లోపల ఉండి ఎవడైతే ధ్యానం చేస్తున్నాడో, వాడే నీకు అడ్డు అన్న సంగతి నీకు తెలియాలి. సాధన చేసి సాధకుడినే నశింపచేయాలి. మనస్సుని నీ మూలాన్ని నువ్వే పట్టుకో అని అడుగుతున్నావు. అది పట్టుకుంటాను అని చెప్పి నటిస్తుంది కాని పట్టుకోదు. భగవాన్ ఏమని చెబుతున్నారు అంటే అది నిన్ను మోసం చేసేస్తోంది కదా, దాని గొడవ వదిలేయ్, ఏ సత్యాన్ని అయితే తెలుసుకోవాలి అనుకుంటున్నావోఆ సత్యం నువ్వే, you are the truth, you are Brahmam. దాని గొడవ వదిలేయ్, దాని ప్రేరణ వదిలేయ్, అది నేను నేను అని నువ్వు అనుకుంటున్నావు కదా, అది నేను అనుకోవడం మానేయ్. దానంతట

అదే వాడిపోయి, రాలిపోతుంది.  You are the truth.

మీ ఇంట్లో ఎవడైనా దొంగతనం చేశాడు అనుకోండి, ఆ దొంగతనం ఎవడైతే చేశాడో వాడి దగ్గరకే వెళ్లి మా ఇంట్లో ఎవడో దొంగతనం చేశాడు మీరు పట్టుకోండి అని అడుగుతారు అనుకోండి, వాడు ఏమంటాడు, మీరు పోలీస్ స్టేషన్‌కి వెళ్ళండి అని చెబితే ఫరవాలేదు కాని మీరు పోలీస్ స్టేషన్‌కి వెళ్ళమని చెప్పడు.  వాడు దొంగతనం చేశాను అని చెప్పడు.  మీరేమి కంగారు పడకండి, మీరు పోలీస్ స్టేషన్‌కి వెళ్ళకండి, ఆ దొంగని పట్టుకోవడానికి నేను ప్రయత్నం చేస్తాను, ఆ గొడవ నేను చూసుకుంటాను, మీరు ఇంటికి వెళ్ళిపొండి అంటాడు.  వాడు దొంగోడిని పట్టుకోడు, ఎందుచేత?  వాడే దొంగవాడు.  ఈ మనసు చేసే గొడవలు అలా ఉన్నాయి.  వాడు కనీసం పోలీస్ స్టేషన్ కి కూడా వెళ్ళమనడు. ఎందుచేత అంటే పోలీసు స్టేషన్ కి వెళితే వాడు పట్టుబడతాడు అని వాడి భయం.  వాడు ఏమంటాడు మీరు మాట్లాడకుండా ఊరుకోండి, ఆ దొంగవాడిని నేను పట్టిస్తాను అని చెబుతాడు.  వాడి మాటలు మనం నమ్మాము అనుకోండి, ఆ దొంగవాడిని వాడు పట్టిస్తాడా? వాడు పట్టివ్వడు.  దొంగ ఇంకా దొరకలేదా అని మనం అడుగుతాము అనుకోండి మీరు కంగారు పడకండి ప్రయత్నం చేస్తున్నాను అంటాడు.  మనం చేసే సాధనలు అన్నీ అలాగే ఉన్నాయి.

నువ్వు ఎవరవు?  You are the truth, నువ్వు బ్రహ్మమే.  నువ్వు దేహంతోటి ఐడెంటిఫై అవ్వకుండా నీ హృదయంలో ఉన్నటువంటి దేవుడి తోటి ఐడెంటిఫై అవ్వు, ఈ దేహాన్ని కేంద్రంగా పెట్టుకుని ఇప్పుడు పని చేస్తున్నావు, కాని దేవుడిని కేంద్రంగా పెట్టుకుని నువ్వు పని చెయ్యి.  ఈ మనస్సు నేను అని ఎన్నిసార్లు అనుకున్నా అది నువ్వు కాదు కాబట్టి అవ్వవు.  మనస్సు, మనస్సు అని అనుకునే బదులు లోపల ఉన్న చైతన్యం తోటి నువ్వు తాదాత్మ్యం పొందితే, మనస్సు దానంతట అదే సన్నగిల్లిపోతుంది, దానికి ఫుడ్ సప్లై కట్ అయిపోతుంది.  ఇప్పుడు మనం చేసే పనులు ఎలా ఉన్నాయో భగవాన్ ఇక్కడ చెబుతున్నారు. మన ఉద్దేశ్యం ఏమో హాలు అంతా ఆరబెట్టాలి అని, కానీ మనం ఏమి చేస్తున్నాము అంటే

వంద బిందెలు నీళ్ళు తీసుకొచ్చి దానిని తడుపుతున్నాము. ఇంక అది ఆరుతుందా అసలు? ఆరనే ఆరదు. నువ్వు అస్తమాను దేనిని పోగొట్టుకోవాలో దానినే జ్ఞాపకం పెట్టుకుంటున్నావు. ఇంక అది ఎలా పోతుంది అంటున్నారు. నువ్వు దేనిని పోగొట్టుకోవాలో, దేంట్లోంచి నువ్వు విడుదల పొందాలో అస్తమాను దానినే జ్ఞాపకంలోకి తెచ్చుకుంటున్నావు. ఇంక అది ఎలా పోతుంది? అలా అయితే దానికి ఫుడ్ సప్లై పెరిగిపోతుంది. నీ సంకల్పమే నా సంకల్పం, నీ ఇష్టమే, నా ఇష్టం అని భగవంతుడికి శరణాగతి పొందటం వల్ల కూడా ఈ మనస్సు నశిస్తుంది. ఒక్కొక్కసారి మనం అనుకున్న పనులు అన్నీ నెరవేరిపోతాయి, అలా నెరవేరిపోయి నపుడు మనం తెలివిగలవాళ్ళం బాగానే ప్రయత్నం చేశాం అనుకుంటాము. కానీ భగవంతుడి సంకల్పం, మన సంకల్పం కలిసినపుడు అది అవుతుంది, భగవంతుడి సంకల్పం వేరు, మన సంకల్పం వేరు అయినపుడు భగవంతుడి సంకల్పం నెరవేరుతుంది కానీ మన సంకల్పం నెరవేరదు.

మీరు ఎవరైనా ఎలక్షన్‌లో నిలబడ్డారు అనుకోండి, ఆ ఎలక్షన్‌లో మీకు జయం కలిగితే నేను బాగా ఎలక్షన్‌లో ప్రచారం చేశాను, ఎన్నికల్లో బాగా ఖర్చు పెట్టాను నెగ్గేశాను అనుకుంటారు, అది అబద్ధం అంటున్నారు భగవాన్. నువ్వు ఎంత ఖర్చు పెట్టావో మిగతా candidates కూడా అంతే ఖర్చు పెట్టారు. ఆ పదవి నీ కర్మ ఫలం. నీకు పదవి వచ్చే యోగం ఉన్నప్పుడు ఈశ్వరుడు కర్మఫలంగా నీకు ఇస్తాడు. కానీ నువ్వు ఏమనుకుంటావు అంటే నా తెలివితేటల వల్ల పదవి సంపాదించేశాను అనుకుంటావు. అది నూటికి నూరు పాళ్ళు అసత్యం అంటున్నారు. నీకు ఏదైనా పదవి వచ్చింది అనుకో, అది కర్మఫలంగా భగవంతుడు నీకు ఇస్తాడు అంతేకానీ నువ్వు ఖర్చు పెట్టిన డబ్బు ఇతర candidates ఖర్చు పెట్టారు, నీకున్న తెలివితేటలు వారికీ ఉన్నాయి, నీకు ప్రచారకులు ఉన్నారు, వాళ్లకీ ప్రచారకులు ఉన్నారు. నువ్వు చేసిన ప్రయత్నం వాళ్ళు చేశారు. మరి వాళ్ళకి జయం ఎందుకు రాలేదు? భగవంతుడు ఏమి చేస్తాడు అంటే జయం వచ్చినా, అపజయం వచ్చినా అది కర్మఫలం. నీ తెలితేటల వల్ల అది రాలేదు, కానీ నా తెలివితేటల వల్ల వచ్చింది అని నువ్వు అనుకుంటావు అదే కర్తృత్వబుద్ధి. ఈ కర్తృత్వబుద్ధి వల్ల అది నావల్లే వచ్చేసింది అని నువ్వు అనుకుంటున్నావు.

రమణమహర్షి గారిని చిక్కు ప్రశ్న అడిగారు, దానికి మనం సమాధానం చెప్పడం కష్టం. దేహం నేను కాదని ఉపనిషత్తులలో చెబుతున్నారు కదా, అది నేను కాదన్నప్పుడు కానట్టుగా నేను ఉండాలి కదా మరి దేహం నేను అనే భావన నాకు ఎందుకు కలగాలి అని అడిగారు. బాగుంది ఆ ప్రశ్న? దానికి భగవాన్ ఏమన్నారు అంటే నువ్వు పూర్వజన్మల్లో పుణ్యం చేసినా, పాపం చేసినా దేహం నేను అనుకునే చేశావు. నువ్వు పుణ్యం చేసి ఉండవచ్చు, పాపం చేసి ఉండవచ్చు, దేహం నేను అనుకునే నువ్వు చేశావు, మళ్ళీ దాని ఫలితం నీచేత అనుభవింపచేయడం కోసం ఈ దేహబుద్ధి నీకు కలుగజేశాడు. దేహం నేను అనుకునే బుద్ధి నీకు లేకపోతే ఆ ఫలితం నీకు అనుభవంలోకి రాదు. ఆ ఫలితం నీకు అనుభవంలోకి రావడం కోసం నీకు దేహబుద్ధి కల్పించాడు కానీ అది నిజం కాదు అన్నారు. దేహం నువ్వు కాకపోయినా దేహం నేను అనుకునే బుద్ధి నీకు ఎందుకు కలిగింది అంటే నీ కర్మానుభవం అంటే నువ్వు చేసిన కర్మ నీకు అనుభవంలోకి తీసుకుని రావడం కోసం నీకు దేహబుద్ధి కలుగజేశాడు. విచారణ చేస్తే పోతుంది.

దేహాన్ని ప్రారబ్దానికి వదిలేసి వచ్చిన పని నువ్వు చూసుకో, అంటే భగవాన్ ఏమని చెప్పారు అంటే మనిషి తల్లి గర్భం నుండి బయటకి వచ్చినది మొదలు స్మశానానికి వెళ్ళేవరకు ఏ గంటలో, ఏ క్షణంలో ఆ దేహం ఎక్కడ ఉండాలో అక్కడే ఉంటుంది. ఇవి బొమ్మలే, ఈ బొమ్మలు మాంసం తోటి తయారు చేశారు అంటారు భగవాన్. అంటే మద్రాసులో సినిమా తీస్తారు, కాకినాడలో ఆడతారు. కానీ కాకినాడలో మనకి సినిమా మార్చడానికి కుదరదు, ఎందుచేత అంటే మద్రాసులో ప్రింట్ అయ్యిపోయింది. అదేవిధంగా తల్లి గర్భంలో నీ శరీరం తయారు అయినప్పుడే నీ సినిమా అంతా తయారు అయ్యిపోయింది, నువ్వు ఏరోజున ఎక్కడ ఉండాలో, ఏ రోజు నువ్వు స్మశానానికి వెళ్ళాలో అంతా నిర్ణయింపబడి ఉంది. ఇప్పుడు దేహం ప్రారబ్ధం ప్రకారం వెళ్ళిపోతుంది అన్నారు. మేము ధ్యానం చేసుకుంటున్నాం, జపం చేసుకుంటున్నాం, ఇదంతా వృథాయేనా అని ఆ ప్లీడరుగారు అడిగారు, అంటే భగవాన్ అన్నారు దేహం దాని ప్రారబ్ధం ప్రకారం అది వెళ్ళిపోతుంది, నువ్వు ధ్యానం చేస్తుంటే, విచారణ చేస్తుంటే, దేహంతోటి తాదాత్మ్యం వదిలిపోతుంది నీకు, దేహప్రారబ్ధం

ప్రకారం incidents జరిగిపోతూ ఉంటాయి, నువ్వు ధ్యానం చేయడం వలన, విచారణ చేయడం వలన ఆ incidents యొక్క ప్రభావం నీ మీద పడదు, అది ధ్యాన ఫలం అన్నారు.

ఇప్పుడు దేహప్రారబ్ధం ప్రకారం అన్నీ జరిగిపోతూ ఉంటాయి, మంచి జరిగిపోతూ ఉంటుంది, చెడ్డ జరిగిపోతూ ఉంటుంది. మంచి జరుగుతుంటే మనకి పొంగు వస్తుంది, చెడ్డ జరుగుతుంటే కృంగిపోతాం, అంటే డిప్రెషన్ వస్తుంది. ఎమోషన్, డిప్రెషన్ అవి మానసిక ప్రవృత్తులు. అయితే నీ సాధనబలం వల్ల దేహప్రారబ్దంలో జరిగే incidents ప్రభావం నీ మీద ఉండదు. జరగవలసినవి జరిగిపోతూ ఉంటాయి కానీ వాటి ప్రభావం నీ మీద ఉండదు అందుచేత నువ్వు హ్యాపీగానే ఉండగలుగుతావు, జరగవలసింది ఏదో జరుగుతూ ఉంటుంది, దానితో నీకు ఐడెంటిఫికేషన్ ఉండదు. ఎప్పుడైతే రాంగ్ ఐడెంటిఫికేషన్ నీ సాధన వల్ల కట్ అయిపోయిందో, ప్రారబ్ధం ప్రకారం దేహయాత్ర చేస్తున్నప్పటికీ దాని ప్రభావం నీ మీద పడదు కాబట్టి నీకు దుఃఖం రాదు.

సాధనకి భగవాన్ ఏమని చెప్పారు అంటే ఆహార నియమం, మాటల్లో నియమం, నిద్రలో నియమం అవసరం అని చెప్పారు. అంటే నిద్ర తగుమాత్రంగా ఉండాలి, ఆహారం తగుమాత్రంగా ఉండాలి, మాటలు కూడా తగుమాత్రంగా ఉండాలి. అంటే అవసరం లేనప్పుడు మాట్లాడకూడదు, అవసరమైనప్పుడు మాట్లాడవచ్చు. అవసరం లేనప్పుడు మాట్లాడుతూ ఉంటాము అనుకోండి మన మాటే మన అహంభావాన్ని పెంచుతూ ఉంటుంది. మాట వల్ల నీ అహంభావన పెరగకూడదు. Moderation in food, moderation in sleep, moderation in words. సాధనలో అన్నిటికంటే ఆహారనియమం ఉత్తమమైనది అని చెప్పారు. అంటే ఆధ్యాత్మిక అభివృద్ధికి ఆహార నియమం నూటికి ఎనభై మార్కులు మీకు తెచ్చిపెడుతుంది అని చెప్పారు.

రమణమహర్షి గారు ఒక మాట చెప్పారు. నేను పుట్టాను అనుకునేవాడికి ఎవడికి మోక్షం రాదు అని చెప్పారు. నేను పుట్టాను అంటే ఎవడు పుట్టాడు? దేహం పుట్టింది. అంటే వాడు దేహం నేను అనుకుంటున్నాడు కాబట్టి నేను పుట్టాను అనుకుంటున్నాడు. దేహం మరణించినపుడు వాడు మరణించాను అనుకుంటున్నాడు. కానీ హృదయంలో

ఉన్న నిజానికి పుట్టుక లేదు, చావు లేదు. దేహం తోటి తాదాత్మ్యం నువ్వు పొందడం వలన దేహం పుట్టినప్పుడు నేను పుట్టాను అనినువ్వు అనుకుంటున్నావు. కానీ హృదయంలో ఉన్న నిజం తోటి నువ్వు తాదాత్మ్యం చెందడం వలన, అంటే దేహం తోటి నీకు ఐడెంటిఫికేషన్ ఎలా ఉందో అలా truth తోటి కనుక ఐడెంటిఫికేషన్ వస్తే, ఆ truth నువ్వే అన్న సంగతి నీకు తెలుస్తుంది, అప్పుడు నువ్వు పుట్టలేదు అన్న సంగతి నీకు తెలుస్తుంది. అప్పుడు నువ్వు eternal stateని అందుకుంటావు. లోపల ఉన్నటువంటి సత్యం ఉంది చూశావు అది సహజంగా శాంతి స్వరూపం, సత్య స్వరూపం. అది ఎలా ఉంటుంది? ఏకంగానే ఉంటుంది, నిదానంగా ఉంటుంది, శాంతిగా ఉంటుంది. దేహం తోటి ఇప్పుడు నీకు తాదాత్మ్యం ఎలా ఉందో అలా లోపల ఉన్న సత్యవస్తువు తోటి నీకు తాదాత్మ్యం వచ్చే వరకు నువ్వు జన్మపరంపరల నుండి విడుదల పొందలేవు.

భగవాన్ చెప్పారు నీ పూజలు, నీ జపాలు, నీ ధ్యానాలు, నీ విచారణలు, నీ తీర్థయాత్రలు, నువ్వు చేసే అన్ని ప్రయత్నాల కంటే, గురువు అనుగ్రహం అత్యంత బలీయమైనది. మీరు పూజలు చెయ్యవచ్చు, జపాలు చెయ్యవచ్చు, ధ్యానాలు చెయ్యవచ్చు. మీ అంతట మీరు చేసే జపం, ధ్యానం, పూజ వాటికి కూడా ఎంతోకొంత శక్తి ఉంది, కానీ ఈ అన్నిటికంటే కూడా గురువు అనుగ్రహం అత్యంత బలీయమైనది. ఏనుగుకి ఎంత బలం ఉంటుందో, అహంభావనకి అంత బలం ఉంటుంది. ఏనుగు ఒక్క సింహానికి తప్పించి దేనికి లొంగదు. అంటే ఈ అహంభావన అనే ఏనుగుకి గురువు అనుగ్రహం అనేది సింహం లాంటిది. అంటే సింహానికి మాత్రమే ఏనుగు లొబడుతుంది. అలాగే నీ



**నీ హృదయంలో సత్య వస్తువు ఉంది.**
**దానితో నిరంతరం కలిసి ఉండు.**
**అదే సత్సంగం.**

అహంభావన గురువు అనుగ్రహానికి లోబడుతుంది కానీ కేవలం నీ తెలివి తేటల వల్ల అది లోబడదు. ఈ అహంకారం అనే ఏనుగు గురువు అనుగ్రహం అనే సింహానికి మటుకే అది స్వాధీనం అవుతుంది. పూజ గదికే నీ సాధన పరిమితం చేసుకోవద్దు, కొంతమంది సాధన అంతా పూజ గదికే పరిమితం చేసుకుంటారు. పూజ గది లోంచి బయటకి వచ్చాక వాళ్లకి ఇంక సాధన గొడవ ఉండదు. అలా కాదు, మీ సాధన అంతా కూడా మీ భక్తి పూజ గదికే పరిమితం అవ్వకూడదు. మీరు దైనందిన జీవితంలో, మీ చేత ద్వారా కానీ, మాట ద్వారా కానీ, తలంపు ద్వారా కానీ మీ అహంభావనకి ఫుడ్ సప్లై అవ్వకుండా చూసుకోవాలి. అలా ఫుడ్ సప్లై అవ్వకుండా చూసుకుంటే, కురుపు పెచ్చు ఎండిపోయిన తరువాత ఎలా రాలిపోతుందో, అలాగ మీ అహంభావన మీకు తెలియకుండానే అది రాలిపోతుంది.

తరువాత హోలీ కంపెనీ ఒకటి చాలా ముఖ్యం. హోలీ కంపెనీ వల్ల కూడా నీ మనసు అణిగిపోతుంది. భగవంతుడు నీకు ఏమైనా గిఫ్ట్ కనుక ఇస్తే, నీకు తెలివి ఉంది అనుకో అదొక గిఫ్ట్, నీకు ధనం ఉందనుకో అదొక గిఫ్ట్, నీకు ఎడ్యుకేషన్ ఉంది అనుకో అదొక గిఫ్ట్, నీకు మంచి క్వాలిటీస్ ఉన్నాయి అనుకో అదొక గిఫ్ట్, వీటి వల్ల అవినయం తెచ్చుకోవద్దు. ప్రారబ్ధంలో ఉంటే అవి వస్తాయి, వీటి వల్ల అవినయం తెచ్చుకున్నావు అనుకో బాహ్యంగా నువ్వు బాగున్నట్టు కనిపించినా, మూలంలో కుళ్ళిపోతూ ఉంటావు. ఇప్పుడు ఎవరైనా ఇతరులకి సహాయం చేస్తున్నారు అనుకోండి దేవుడు ఇచ్చిందే మీరు సహాయం చేస్తున్నారు అనుకోండి, మనకి తెలివి ఉన్నా దేవుడు ఇచ్చిందే, ధనం ఉన్నా దేవుడు ఇచ్చిందే, ఆయన గిఫ్ట్ ఇవ్వకపోతే అది మనకి రాదు కదా, ఆ అవకాశం మనకి ఇవ్వకపోతే అది మనకి రాదు కదా, మన పద్ధతి ఎలా ఉందో భగవాన్ ఉదాహరణ చెప్పారు, ఈ ఒక్క ఉదాహరణ చాలు మనల్ని అర్థం చేసుకోమనేవారు. ఒకడు బెల్లం తోటి వినాయకుడిని చేశాడు. బెల్లం వినాయకుడికి నైవేద్యం పెట్టడానికి వాడికి ఏమీ కనిపించడం లేదు అప్పుడు వాడు ఏమి చేశాడు అంటే ఆ బెల్లం వినాయకుడిని కొంచెం గిల్లేశాడు. ఆయన్ని గిల్లేసిన బెల్లం ఆయనకి చూపించి ఇదే నీకు నైవేద్యం అన్నాడు. అలాగ మనం కూడా ఏమి చేస్తున్నాము అంటే భగవంతుడు మనకి ఇచ్చిందే ఇతరులకి ఇచ్చి నేను ఇచ్చాను అని

అహంభావనని పెంచుకుంటున్నాం. ఇదంతా ఆర్టిఫిసియల్ “I” చేసే గొడవ అన్నారు భగవాన్. అందుచేత భగవాన్ ఏమని చెప్పేవారు అంటే నీ అహంభావనని పోగొట్టుకోవడానికి తగిన శక్తి నీకు సరిపోకపోవచ్చు కనీసం దానిని డౌట్ చేయడం ప్రారంభించమన్నారు ముందు. అంటే అహంభావనే నువ్వు నిజం అనుకుంటున్నావు, దానిని కేంద్రంగా పెట్టుకుని నువ్వు జీవిస్తున్నావు. అది ఉంటుందో, పోతుందో తరువాత విషయం, ముందు డౌట్ చేయడం ప్రారంభించు, డౌట్ చేయడం ప్రారంభించడం కూడా సాధనలో ఒక భాగమే. మన ప్రశ్నతోటే ఆయన మన నెత్తిమీద మొట్టికాయ మొడుతూ ఉంటారు. భగవాన్ దగ్గరకి ఒకరు వచ్చి మీరు ఎప్పుడూ నాకు దర్శనం ఇస్తూ ఉండాలి అన్నారు. మరి ఎప్పుడూ నీకు దర్శనం ఇస్తూ ఉండాలి అంటే నువ్వు కూడా ఎప్పుడూ ఉండాలి కదా, నువ్వు కూడా ఎప్పుడూ ఉండాలని ఉందా నీకు అన్నారు. నేను ఎప్పుడు నీకు దర్శనం ఇస్తూ ఉండాలి అని కోరుకుంటున్నావు అంటే చూసేవాడివి నువ్వు ఉండాలి కదా, అంటే నువ్వు కూడా ఎప్పుడూ ఉండాలి అని కోరుకుంటున్నావు అన్నమాట, అంటే వాడి ప్రశ్న పుచ్చుకుని వాడి నెత్తిమీద ఒక మొట్టికాయ మొట్టారు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు॥ 150/-లు.**

**శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**

అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

# చైతన్యానుభవం అయ్యేవరకు దుఃఖం తప్పదు

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)

మీరు ధనవంతులు అయినా, బీదవారు అయినా, మీకు చదువున్నా, చదువు లేకపోయినా, మీ హృదయంలో ఉన్నటువంటి ఆత్మ, హృదయంలో ఉన్న పరమేశ్వరుడు, అనుభవంలోకి వచ్చే వరకు సంసారం తప్పదు, ఈ దుఃఖం, బాధ, కష్టం, నష్టం, ఏదీ తప్పదు. ఆ పరమేశ్వరుడు ఇక్కడే ఉన్నాడు. ఇప్పుడే ఉన్నాడు, always present, ఒకప్పుడు ఉండి ఇప్పుడు లేకపోవటం అంటూ లేదు. మన హృదయంలో సిద్ధంగా ఉన్నాడు. మనం నిద్ర పోతున్నప్పుడు కూడా పరమాత్మ మెలకువగానే ఉన్నాడు. వస్తువు మన హృదయంలోనే ఉంది కాని మనకి అనుభవంలో లేదు. మీ ఇంటి దగ్గర పెట్టెలో వంద రూపాయలు ఉన్నాయి కాని అది మీకు తెలియకపోతే ఉన్నా సుఖం లేదు. ఎందుచేతంటే అది మీరు వాడుకోవటానికి ఏమి ఉపయోగపడదు. అదే విధంగా హృదయంలో ఆత్మ ఉన్నప్పటికీ, అది మీకు తెలియకపోతే, దానిలో ఉండే శాంతి కాని, సుఖం కాని, అమృత తత్త్వం కాని మీకు అనుభవంలోకి రాదు. మనకి పరమేశ్వరుడు అనుభవంలో లేదు, ఆత్మ అనుభవంలో లేదు, కాని మనకి మన దేహం అనుభవంలో ఉంది, మన అహంకారం, మనస్సు అనుభవంలో ఉన్నాయి. దేవుడు ఉన్నాడు, దేవుడు లేడు అనే ప్రశ్నల జోలికి వెళ్ళక్కరలేదు. నా శరీరం నాకు అనుభవంలో ఉంది కాబట్టే ఈ శరీరానికి ఏదైనా బాధ వస్తే, కష్టం వస్తే నాకు తెలుస్తుంది. దీనికి రోగం వస్తే మందులు వేసుకుంటున్నాను. ఈ శరీరం గురించి ఎన్నో బాధలు పడుతున్నాను. ఈ శరీరం లోంచి, నాకు సుఖం కంటే ఎక్కువ దుఃఖమే వస్తోంది. ఈ శరీరం అందరికి అనుభవంలో ఉంది.

ఈ సృష్టిలో రెండు రకాల బాధలు ఉన్నాయి. ఒకటి శారీరకమైన బాధ, రెండు మానసికమైన బాధ. శరీరానికి సంబంధించిన రోగం వస్తే, ఇది ముసలిది అయిపోతే బాధ పడతాము, దీనికి మరణం వస్తే బాధ పడతాము. ఈ శరీరం అనుభవంలో ఉంది కాబట్టి, శరీరానికి ఏమి వచ్చినా బాధ పడతాము. రెండవది మనస్సు అనుభవంలో ఉంది. దానికి దుఃఖం వస్తూ ఉంటుంది, సంతోషం వస్తూ ఉంటుంది, ఒకళ్ళ మీద కోపం, ఒకళ్ళ మీద

ఈర్ష్య వస్తూ ఉంటుంది. ఉన్నది ఒక్కటే వస్తువు, ఒక్కటే ఆత్మ అయినప్పుడు, కామం, కోపం, ఈర్ష్య, అసూయ, ఇవన్నీ ఎందుకు వస్తున్నాయి? ఎవరి మీద వస్తున్నాయి? మిమ్మల్ని ఒక శరీరంగానో, మనసుగానో చూస్తున్నాను కాబట్టి నాకు మీ మీద అసూయ వస్తోంది. మీలో ఆత్మ ఉంది అని గ్రహించే శక్తి నాకు ఉంటే, ఆత్మానుభవం కనుక నాకు ఉంటే, మీ మీద నాకు అసూయ రాదు, కోపం రాదు, మీ మీద నాకు ద్వేషం పుట్టదు. ఈ కోపాన్ని ఒక జీవుడు ఇంకొక జీవుడు మీద గురి పెడుతున్నాడు. ఏ కోపాన్ని, ద్వేషాన్ని అయితే ఎదుటి మనిషి మీద గురి పెడుతున్నాడో, అది మళ్ళీ ఇతనికే తిరిగి వచ్చేస్తుంది. ఏదైతే మనం లోకానికి ఇచ్చామో, అదే మళ్ళీ మనకి తిరిగి వస్తుంది. ఇంగ్లీషులో ఒక సామెత ఉంది. మీలో మంచి ఉండవచ్చు, చెడ్డ ఉండవచ్చు. కాని లోకానికి ఇచ్చేటప్పుడు మంచినే ఇవ్వండి. మీకు తెలివి తేటలు ఉంటే లోకానికి మీ తెలివి ఇవ్వండి. మీకు ఏదైనా మంచితనం ఉంటే లోకానికి మీ మంచితనం ఇవ్వండి, మీరు ఇచ్చిన మంచే మళ్ళీ పరమేశ్వరుడు మీకు తిరిగి ఇచ్చేస్తాడు. సాధారణంగా మంచిని మనం ఉంచుకుంటాం, చెడ్డని ఎదుటి వాళ్లకి ఇస్తాం, ఇది మనకి అలవాటు. అందుచేత ఆ చెడ్డే మళ్ళీ మనకి తిరిగి వస్తుంది. లోకానికి ఏదైతే మనం ఇచ్చామో అదే మళ్ళీ మనకి తిరిగి వస్తుంది.

ఇంతకీ బాధ రెండు రకాలు. ఏ మనిషి బాధపడినా, దుఃఖపడినా, కష్టపడినా, ఇవి రెండే కారణం – ఒకటి శరీరం, రెండు మనస్సు. ఈ రెండింటి చుట్టూనే మనం తిరుగుతున్నాం. ఆత్మలో సుఖం, శాంతి, ఆనందం ఉన్నాయి అంటున్నారు.కాని ఆత్మ మనకు అనుభవంలో లేదు కాబట్టి, దానికి సంబంధించిన శాంతి కాని, సుఖం కాని, ఆనందం కాని మనకు ఏమి దొరకటం లేదు. మనకి మన అహంకారం అనుభవంలో ఉంది, మన ఇష్టాయిష్టాలు అనుభవంలో ఉన్నాయి. మన శరీరం, మనస్సు అనుభవంలో ఉన్నాయి. ఈ శరీరం గురించి మనం బెంగ పెట్టుకుంటాం. మనసు గురించి బెంగ పెట్టుకుంటాం. మనస్సుకి ఏదైనా కష్టం వస్తే బాధ పడతాం. హృదయంలో ప్రకాశిస్తున్న పరమేశ్వరుడిని మనం తెలుసుకునే వరకు, ఈ రెండింటి యొక్క బాధలు ఎన్ని జన్మలు ఎత్తినా, ఎన్ని లోకాలకి వెళ్ళినా, కోటి సంవత్సరాలు బ్రతికినా మనకి తప్పదు. అందుచేత ఈ రెండింటిని అతిక్రమించాలి. ఈ ప్రకృతి లోంచి, ఈ సంసార చక్రం నుండి బయటపడాలి అంటే, దుఃఖం లోంచి, వేదన లోంచి, ఆవేదన లోంచి, అశాంతి లోంచి బయటపడాలి అంటే, ఆ చైతన్య స్వరూపాన్ని, ఆత్మ రూపంలో ఉన్న అరుణాచలేశ్వరుడిని ఎలా తెలుసుకోవాలో, అక్షరమణమాలలో రమణస్వామి చెప్పాడు.



ఓం శ్రీ నాన్నపరమాత్మనే నమః

# అరుణాచల మహాదీపోత్సవం సందర్భంగా

# ది॥ 03-12-2025 బుధవారం

# జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో జరుగు కార్యక్రమములు

| | | |
|---|---|---|
| ఉ॥ గం॥ | 6-00 లకు | **పారాయణం** |
| ఉ॥ గం॥ | 6-45 ని॥లకు | **నెమలి, శేష వాహనములపై గిరిప్రదక్షిణ** |
| ఉ॥ గం॥ | 7-00 లకు | **అల్పాహారం** |
| ఉ॥ గం॥ | 9-30 ని॥లకు | **సత్సంగం** |
| ఉ॥ గం॥ | 11-00 ల నుండి | **అన్న ప్రసాదం** |
| మ॥ గం॥ | 3-00 లకు | **సత్సంగం** |
| సా॥ గం॥ | 5-00 లకు | **పారాయణం** |
| సా॥ గం॥ | 6-00 లకు | **దీపోత్సవం** |

**భక్తులందరకీ ఆహ్వానం**

**- శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు**

# శ్రీ కావ్యకంఠ గణపతి మునీంద్రులు

నవంబరు 17, 1878న ఆంధ్ర రాష్ట్రములోని కలువరాయి గ్రామంలో జన్మించిన శ్రీకావ్య కంఠ గణపతి ముని అరుణాచల క్షేత్రంలో జపనిమిత్తం కొంతకాలం ఉన్నారు, అప్పుడు మౌన నిష్ఠలో ఉన్న రమణుని చూసారు. తరువాత దైవప్రేరణ ఫలితంగా 18-11-1907న భగవాన్ శ్రీరమణుని దర్శించి, ఉపదేశము పొందారు. అప్పుడు గణపతి ముని భగవాన్‌తో స్వామీ "నేను చదువవలసిందంతా చదివాను, ఎంతో మంత్రజపం చేసాను, కాని ఇప్పటి వరకు తపస్సంటే ఏమిటో తెలియలేదు, కరుణించి తపస్సు స్వభావాన్ని తెలపండి" అని వేడుకున్నారు. అప్పటివరకు మౌనంగా ఉన్న భగవాన్ మెల్లగా గొంతుసవరించుకుని "ఈ నేను అను భావన ఎక్కడ నుండి పుడుతోందో పరికించిన మనస్సు అందులో లీనమవుతుంది, అట్లే మంత్రమును జపిస్తున్నప్పుడు మంత్రనాదము ఎక్కడ నుండి పుడుతోందో పరికించిన మనస్సు అందులో లీనమవుతుంది, అదే తపస్సు" అని చెప్పారు. ఈ దివ్యోపదేశానికి గణపతి ముని పులకించిపోయారు. ఆయన మనస్సు ఆనందతాండవం చేసింది, ఆయనకు భారం తీరింది. కొంచెముసేపు కూర్చుని పళనిస్వామి ద్వారా స్వామి పేరు వేంకటరామన్ అని తెలుసుకుని ఆశువుగా ఐదు శ్లోకాలు చెప్పారు. అందులో వెంకట రామన్ పేరును "రమణ" గా మార్చి చెప్పారు. ఆ మార్పుకు శ్రీరమణుడు ఆమోదించినట్లు దరహాసం చేసారు. మరునాడే శ్రీగణపతి ముని తన బంధువులకు, స్నేహితులకు లేఖలు వ్రాసారు. అందులో తనకు ఒక సద్గురువు లభించినట్లు, ఆయన తనకు జ్ఞానోపదేశం చేసినట్లు, ఆయనను భగవాన్ శ్రీరమణ మహర్షిగా తన వారందరికీ పరిచయం చేసారు. భగవాన్ శ్రీరమణ మహర్షి సద్గురువుగా లభించడం తన తపఃఫలంగా భావించారు గణపతి ముని. శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పిన విధముగా గణపతి ముని రమణగీతను సంకలనం చేసారు. అందులో సాధకుని అప్రమత్తత, హృదయ విజ్ఞానం, ఆత్మవిచారణ, మనోనిగ్రహము లాంటి ముఖ్యాంశముల వివరణ ఉంది. "రమణగీత" భగవాన్ శ్రీరమణ మహర్షి ప్రబోధించిన తాత్త్విక విచారణ. గణపతి ముని యెడల భగవాన్‌కి ఎంతో ప్రేమ, గౌరవము. అట్లే గణపతి మునికునూ భగవాన్ యెడల గురుభావము, ఎంతో ప్రేమ, భక్తి. శ్రీగణపతి మునిని "నాయన" అని సంభోదించేవారు భగవాన్. బహుముఖ ప్రజ్ఞాశాలి, భగవాన్ శ్రీరమణునికి అత్యంత ప్రేమపాత్రుడు అయిన శ్రీకావ్యకంఠ గణపతిముని ది॥ 25-07-1936న శివైక్యము చెందారు. తొలిసారి 18-11-1907న భగవాన్ శ్రీరమణమహర్షిని దర్శించి, అంతవరకు అణిగి ఉన్న దివ్యత్వాన్ని, దివ్యబోధను బహిర్గతపరచి "భగవాన్ శ్రీరమణ మహర్షి" అని పేరిడి, ఆయన పాదాలకు అంకితమైపోయిన శ్రీకావ్యకంఠ గణపతిముని మనందరికీ సదా స్మరణీయులు. రమణభక్త కుటుంబం శ్రీగణపతి మునికి ఋణపడి ఉంటుంది. పదకొండు సంవత్సరాల మౌన దీక్షను విరమింపజేసారు, ఆరోజు 18-11-1907. ఆనాడే శ్రీరమణుని తొలి ఉపదేశవాణి వినిపించింది. శ్రీగణపతి మునికి తపస్సుకు అర్థం వివరించడానికై మౌనం వదిలినరోజు.

**(ది॥ 18-11-1907న శ్రీగణపతి ముని భగవాన్‌ని తొలిసారి దర్శించినరోజు సందర్భముగా...)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**